రోడ్డుపై పశువులు.. వాహనదారులకు తిప్పలు



యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్‌లోని యైటింక్లయిన్‌కాలనీ నుంచి గోదావరిఖనికి వెళ్లే ప్రధాన రహదారిపై రాత్రి పశువులు నిద్రించడంతో వాహనదారులు తిప్పలు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రోడ్లపైకి పశువులు రాత్రివేళల్లో వస్తే వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆవేద వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపైకి పశువులు రాకుండా యజమానులు పశువుల పాకల్లోకి తరలించాలని వాహనదారులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు. సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వరాహం.. స్వైర విహారం



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 22వ డివిజన్ చైతన్యపురికాలనీలో పందులు ఇళ్ల మధ్యలో సంచరిస్తున్నాయి. ఇళ్ల మధ్యలో పందులు స్వైర విహారం చేయడంతో కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి పందులను తరలించేలా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

అధికారులకు క్వార్టర్ల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌కు హాజరైన అధికారులు

గోదావరిఖని: సింగరేణి అధికారులకు క్వార్టర్ల కౌన్సెలింగ్‌ను శుక్రవారం ఆర్జీ–2 జీఎం కార్యాలయంలో నిర్వహించారు. కాన్ఫరెన్స్ హాలులో జరిగిన కౌన్సెలింగ్‌లో ఇంత వరకు క్వార్టర్ లేని, చేంజ్ ఆఫ్ క్వార్టర్ల కోసం దరఖాస్తు చేసుకున్న ఆర్జీ–2, 3 ఏఎల్పీ, ఓసీపీ అధికారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. 26 క్వార్టర్లకు గాను 20మంది దరఖాస్తు చేసుకోగా, ఐదుగురు క్వార్టర్లు తీసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం సంతోష్‌కుమార్, పర్సనల్ డీజీఎం అరవిందరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్

పెద్దపల్లిరూరల్: ప్రతీఒక్కరు తమ ఇంటి ఆవరణం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ సూచించారు. పెద్దపల్లిలోని పలు వార్డుల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న వందరోజుల ప్రణాళిక–ఒక మార్పు అనే నినాదంలో భాగంగా శుక్రవారం ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం చేపట్టారు. వార్డు ఆఫీసర్లు, మెప్మా సిబ్బంది, ఆశావర్కర్లతో ఇంటి యజమానులకు అవగాహన కల్పించారు. వార్డు ఆఫీసర్లు, ఆశావర్కర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

పచ్చదనంపై ప్రచారం



యైటింక్లయిన్‌కాలనీ: చిల్డ్రన్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో చిన్నారులు యైటింక్లయిన్ కాలనీలో పచ్చదనంపై ప్రచారం నిర్వహించారు. పర్యావరణ కాలుష్య నివారణకు ప్రతీఒక్కరు మొక్కలు నాటాలని కాలనీ వీధుల్లో తిరుగుతూ మొక్కలు పంపిణీ చేశారు. ఆర్గనైజేషన్ సభ్యులు రెహాన్, నసిరా, ఐషా సిద్ధిఖా, సబీరానాజ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

గోదావరి జలాలపై సీఎం ద్రోహం

పెద్దపల్లిరూరల్: గోదావరి బనకచర్ల జలాలను ఆంధ్రప్రదేశ్‌కు చేరేలా సీఎం రేవంత్‌రెడ్డి సహకరిస్తూ రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నారని బీఆర్‌ఎస్వీ నాయకుడు రాజోజుల శివకుమార్ ఆరోపించారు. పెద్దపల్లిలోని ట్రినిటి, గాయత్రీ కాలేజీ విద్యార్థులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. గోదావరి నీటి జలాల వినియోగంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదన్నారు. ఏపీ సీఎంతో కలిసి రాష్ట్రానికి అన్యాయం చేసేలా సీఎం వ్యవహరిస్తున్నాడన్నారు. నాయకులు ఉప్పురాజ్‌కుమార్, కర్రె దేవేందర్‌రెడ్డి, శివకుమార్, గోవర్దన్, మనోజ్, అరుణ్, సాయి ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల సాధనలో ముందంజ

పాలకుర్తి: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యల సాధనలో పీఆర్‌టీయూ టీఎస్ యూనియన్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని యూనియన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని కన్నాల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 2025–26 వార్షిక సభ్యత్వాన్ని ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పర్యటించి యూనియన్ సభ్యత్వాలు చేపట్టారు. యూనియన్ నాయకులు రాజేందర్, రాజయ్య, రవినందన్‌రావు, ప్రతాప్‌రెడ్డి, గోపాల్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ

రామగిరి: మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను శుక్రవారం మండల వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్ తనిఖీ చేశారు. మండలంలో అందుబాటులో 185 మెట్రిక్ టన్నుల యూరియా, 4100 బస్తాలు ఉన్నాయని తెలిపారు. స్టాక్, డెలివరీ రిజిస్టర్లు, బిల్ బుక్ రికార్డులను తనిఖీ చేసి షాపులో ఉన్న సీడ్స్, ఫర్టిలైజర్ బస్తాలను పరిశీలించారు. ఏఈవోలు అరవింద్, నవీన్ ఉన్నారు.

మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన

పాలకుర్తి: మండలంలోని కుక్కలగూడూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బసంత్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఏఎస్సై సత్యనారాయణ, పోలీస్‌సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొట్టుకుపోయిన రోడ్డు



కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మల్యాల–పోచంపల్లి మధ్యలో తాత్కాలికంగా నిర్మించిన మట్టిరోడ్డు వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో వ్యవసాయదారులు, రెండు గ్రామాల ప్రజలు, వ్యవసాయ కూలీలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మొరంపోసి రాకపోకలు పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు



నిల్వ నీటిని తొలగిస్తున్న సిబ్బంది

సుల్తానాబాద్: ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేశ్ అన్నారు. మున్సిపల్ పరిధిలో స్వచ్ఛ శుక్రవారంలో భాగంగా పలు కాలనీల్లో శుక్రవారం సిబ్బందితో ప్లాస్టిక్‌ను తొలగించారు. డ్రైనేజీల్లో ప్లాస్టిక్ కవర్లు వేయొద్దని, మార్కెట్‌కి వెళ్లేటప్పుడు ప్లాస్టిక్ కవర్లు కాకుండా చేతి సంచులు తీసుకొని రావాలని కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, వార్డు ఆఫీసర్ దివ్యభారతి, శానిటేషన్ సిబ్బంది శ్రావణ్‌కుమార్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో 'అమ్మ పేరుతో మొక్క' కార్యక్రమం



మొక్కలతో బీజేపీ నాయకులు

మంథని: మున్సిపల్ పరిధిలోని బోయిన్‌పేటలో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. అమ్మ పేరుతో మొక్క అనే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక బలవీర హనుమాన్ దేవాలయ ఆవరణలో మొక్కలు నాటారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు సబ్బని సంతోష్, నాయకులు బోగోజు శ్రీనివాస్, సామల అశోక్, బొల్లంపల్లి లక్ష్మణ్, పార్వతి విష్ణు, పిడుగు సురేశ్, కొంతం సమ్మయ్య ఉన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



ఒడిబియ్యం పోస్తున్న భక్తులు

యైటింక్లయిన్‌కాలనీ: శ్రావణమాసం సందర్భంగా కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలోని అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం మొదటి శుక్రవారం కావడంతో మహిళలు అమ్మవారికి ఒడిబియ్యంతో పాటు చీర, గాజులు, పూలు, పండ్లు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు దేవ్ ప్రకాశ్ పాండే భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి సతీమణి లక్ష్మి, ఆలయ కోశాధికారి సురేశ్ సతీమణి, సుకన్య, రమాదేవి, సత్య, రజిత, రమ, నవిత, రాధిక, పద్మ, స్రవంతి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• మహిళల భద్రతపై అవగాహన

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 22వ డివిజన్ గౌతమినగర్‌లోని మైనారిటీ బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు షీటీం ఇన్‌చార్జి ఎస్సై లావణ్య ఆధ్వర్యంలో మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసం ప్రతీ బస్టాండ్, ప్రధాన చౌరస్తాలో షీటీం నిరంతరం గస్తీ నిర్వహిస్తుందన్నారు. ఎవరైనా వేధింపులకు గురైతే 63039 23700 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. షీటీం సభ్యులు మౌనిక, సురేశ్, ప్రిన్సిపాల్ ఇర్షాద్ ఉల్లాహ్ ఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

పాలకుర్తి: బసంత్‌నగర్ ఇండియా మిషన్ సెకండరీ పాఠశాల విద్యార్థి నిక్షయ్ రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ కృష్ణమూర్తి శుక్రవారం తెలిపారు. ఇటీవల గోదావరిఖనిలో జరిగిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో నిక్షయ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించాడన్నారు. దీంతో ఈనెల 28న వరంగల్‌లో జరిగే బాలుర బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని కృష్ణమూర్తి పేర్కొన్నారు. నిక్షయ్‌ను పాఠశాల కరస్పాండెంట్ మహేంద్రన్ అభినందించారు.

• నేడు నానో యూరియాపై అవగాహన

పాలకుర్తి: మండల రైతువేదికలో శనివారం రైతులకు నానో యూరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్ తెలిపారు.

• ఏసీపీకి పరామర్శ

పాలకుర్తి: పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణయాదవ్‌ను శుక్రవారం బసంత్‌నగర్ అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ కాంట్రాక్ట్ కార్మికసంఘం నాయకులు శుక్రవారం పరామర్శించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్, సలహాదారులు బత్తిని సతీశ్, వేల్పుల సంపత్‌యాదవ్, తోడేటి రవికుమార్‌యాదవ్, మల్లెత్తుల శ్రీనివాస్‌యాదవ్ ఏసీపీ స్వగృహానికి వెళ్లి ఐలయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

• విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

రామగుండం: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో అంతర్గాం తహసీల్దార్ తూము రవీందర్‌పటేల్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘాల ప్రతినిధులు గద్దె శ్రీనివాస్, బాలశౌరిరెడ్డి, చంద్రశేఖర్, తిరుపతి, రవి ఉన్నారు.

• నవోదయ పరీక్షపై ఉచిత అవగాహన

గోదావరిఖనిటౌన్: నవోదయ పరీక్షపై ఉచిత అవగాహన సదస్సు, ఉచిత టాలెంట్ టెస్ట్ శ్రీనివాస నవోదయ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో 27న స్థానిక మార్కండేయకాలనీలోని గాంధీ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు శ్రీనివాస్ తెలిపారు. ఉత్సాహం ఉన్న విద్యార్థులు తమ పేర్లను శనివారంలోపు ఆఫీసులో నమోదు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. వివరాలకు 99661 95441, 84639 75441 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

• వృద్ధుడి ఆత్మహత్య

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌కు చెందిన దాడి మల్లయ్య(71) కడుపు నొప్పి భరించలేక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ సనత్‌కుమార్ కథనం ప్రకారం పెద్దాపూర్‌కు చెందిన మల్లయ్య కొంతకాలంగా కరీంనగర్‌లో ఉంటూ నూతన భవనాలకు నీరు పట్టి జీవిస్తున్నాడు. అప్పుడప్పుడు కడుపు నొప్పి వచ్చి అనారోగ్యం పాలు కాగా సొంత గ్రామం పెద్దాపూర్‌కు వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం కడుపు నొప్పి రావడంతో చికిత్స చేయించుకుంటానని వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. శుక్రవారం గ్రామస్తులు స్థానిక శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి వెళ్తుండగా గంగాదేవి ఆలయం వెనకాల చెట్టుకు ఉరేసుకుని కనిపించగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు పెద్దమల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

• వృద్ధురాలి ఆత్మహత్య

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని నారాయణపూర్‌కు చెందిన పొన్నం పుల్లమ్మ(84)అనే వృద్ధురాలు శుక్రవారం చేతబావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పుల్లమ్మ కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో సమీపంలోని చేతబావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి కొడుకు, కూతురుండగా కొడుకు చనిపోగా కొడలివద్దే ఉంటోంది. కూతురు సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

• ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక రూ.వెయ్యికే అమ్మాలి

ఓదెల: ఇందిరమ్మ లబ్ధిదార్లకు రూ.వెయ్యికే ఇసుక అమ్మాలని తహసీల్దార్ ధీరజ్‌కుమార్ ఆదేశించారు. ఓదెల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ట్రాక్టర్ యాజమానులు ఇందిరమ్మ ఇళ్లు కట్టుకునే వారికి రూ.1000కి పైగా అమ్మొద్దన్నారు. అధికరేట్లకు ఇసుక విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. పొత్కపల్లి ఎస్సై రమేశ్, ఎంపీవో షబ్బీర్ పాల్గొన్నారు.

• విద్యార్థినులకు సన్మానం

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలోని పూసాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులను లయన్స్ క్లబ్ ప్రతినిధులు శుక్రవారం సన్మానించి, నగదు ప్రోత్సాహకం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి, మండలంలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులు బి.గాయత్రి, డి.లక్ష్మీప్రసన్న, ఎం.సింధూజకు జిల్లా చీఫ్ కో–ఆర్డినేటర్ వలస నీలయ్య రూ.6వేల నగదు అందజేశారు. ముఖ్య అతిథి మండల విద్యాధికారి రాజయ్య, క్లబ్ అధ్యక్షుడు జూపల్లి తిరుమల్‌రావు, జిల్లా చీఫ్ కో–ఆర్డినేటర్ వలస నీలయ్య, జిల్లా హంగర్ రిలీఫ్ కో–ఆర్డినేటర్ మాటేటి శ్రీనివాస్, క్లబ్ ఉపాధ్యక్షుడు సాంబమూర్తి, కోశాధికారి సతీశ్, వెంకటేశం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేత్రదానం మహాదానం



డోనర్ కార్డులు చూపుతున్న ఉద్యోగులు

యైటింక్లయిన్‌కాలనీ: నేత్రదానం మహాదానమని సదాశయ ఫౌండేషన్ సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి అన్నారు. ఆర్జీ–2 ఏరియా సింగరేణి సేఫ్టీ మేనేజ్‌మెంట్ ట్రెనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న ఉద్యోగులకు శుక్రవారం నేత్ర, శరీర, అవయవదానాలపై అవగాహన కల్పించారు. శిక్షణ పొందుతున్న 32మంది యువ ఉద్యోగులు నేత్రదానానికి ముందుకు రాగా వారికి శిక్షణ కేంద్రం డీవైజీఎం విజయ్‌కుమార్ వారికి డోనర్ కార్డులు అందజేశారు. నేత్రదానానికి ముందుకు వచ్చిన సింగరేణి ఉద్యోగులను సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు అభినందించారు.

ఓబీసీ మహాసభ విజయవంతం చేయాలి

సుల్తానాబాద్‌రూరల్: బీసీ రిజర్వేషన్ల కోసం దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమం విస్తరించేందుకు ఆగస్టు 7న గోవాలోని శ్యాంప్రసాద్‌ముఖర్జీ ఇండోర్‌లో అఖిల భారతీయ జాతీయ ఓబీసీ మహాసభ జరగనుందని, దీన్ని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కన్న రమేశ్ కోరారు. మండలంలోని గర్రెపల్లిలో శుక్రవారం మహాసభకు సంబంధించిన పోస్టర్ ఆయన ఆవిష్కరించారు. బీసీ సంఘం నాయకులు అజయ్‌గౌడ్, రాజయ్య, శ్రీనివాస్, దినేశ్, కుమార్, సంపత్, కనకయ్య, మల్లయ్య, తిరుపతి ఉన్నారు.

లక్ష్యాల సాధనకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

గోదావరిఖని: వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆర్జీ–2 జీఎం బి.వెంకటయ్య ఆదేశించారు. ఏరియాలోని ఓసీపీ–3 అధికారులతో శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గని ఉత్పత్తికి సంబంధించిన విషయాలపై చర్చించారు. ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం సంతోష్‌కుమార్, ఇంజనీర్ రాజాజీ, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, పర్సనల్ డీజీఎం అరవిందరావు, మేనేజర్ భారత్‌కుమార్ పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నిర్దేశిత ధరల ప్రకటన

రామగుండం: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులపై ఆర్థిక భారం మోపకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అంతర్గాం తహసీల్దార్ తూము రవీందర్‌పటేల్ ఆదేశించారు. శుక్రవారం ఆయన ఛాంబర్‌లో వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ గృహ నిర్మాణ లబ్ధిదారుకు ఇసుక ట్రాక్టర్ రూ.వెయ్యి, మేస్త్రీలు, సెంట్రింగ్ వ్యక్తులకు ప్రతీ చదరపు అడుగుకు తీసుకోవాల్సిన రుసుం, ఇటుక బట్టీ యజమానులు ఒక ఇటుక ధర రూ.5.25 వసూలు చేయాలని నిర్ణయించారు. ఎంపీడీవో బైరి వేణుమాధవ్, డిప్యూటీ తహసీల్దార్ మల్యాల తిరుపతి, ఎస్సై బోయ వెంకటస్వామి, హౌజింగ్ ఏఈ సంజయ్‌చారి పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

ముత్తారం: మండలంలోని ఓడేడులో శుక్రవారం పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. మండలంలోని అడవిశ్రీరాంపూర్, ముత్తారం ఓడేడు గ్రామాలకు చెందిన ఏడుగురు పేకాట ఆడుతుండగా పోలీసులకు దొరికారు. వారి వద్ద రూ.14600 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

డ్రైవర్ల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న బుర్ర తిరుపతి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణిలో పనిచేస్తున్న ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–1 కన్వీనెన్స్ డ్రైవర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కాంట్రాక్ట్ కార్మికుల రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర తిరుపతి అన్నారు. యైటింక్లయిన్‌కాలనీ ఏఐటీయూసీ కార్యాలయంలో ఓసీపీ–1 కన్వీనెన్స్ డ్రైవర్లతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో జీతం నుంచి కటింగ్ అయిన అడాప్ట్ పేమెంట్ ఇవ్వడానికి యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. ఇప్పటి వరకు సీఎంపీఎఫ్ నంబర్స్ లేని వాళ్లకి తొందరగా సీఎంపీఎఫ్ నంబర్లు ఇవ్వాలని యాజమన్యాన్ని కోరినట్లు తెలిపారు. పెరిగిన జీతాలను వెంటనే అమలు చేయాలని ఓనర్లతో చర్చించినట్లు పేర్కొన్నారు. ఓసీపీ–1 కన్వీనెన్స్ డ్రైవర్లు పాల్గొన్నారు.



ధర్మారం: మండలంలోని పత్తిపాక క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పడిన పెద్దగుంతలో వర్షపు నీరు చేరి ప్రమాదకరంగా మారింది. కరీంనగర్, రాయపట్నం ప్రధాన రాష్ట్ర రహదారి అనుబంధంగా ఉన్న పత్తిపాక క్రాస్‌రోడ్డు దాదాపు ఆరు గ్రామాలకు రోడ్డు సౌకర్యంగా ఉంటుంది. అయితే ఈ క్రాస్‌రోడ్డు సమీపం నుంచి రాష్ట్ర రహదారి వరకు ఏర్పడిన పెద్ద గుంతలో వర్షపు నీరు చేరడంతో వాహనదారులు అందులో పడిపోయి గాయాలపాలవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే గుంత పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

ప్రమాదాల్లేని సింగరేణిగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న సేఫ్టీ జీఎం మధుసూదన్

గోదావరిఖని: ప్రమాదాల్లేని సింగరేణిగా తీర్చిదిద్దేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలని రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం మధుసూదన్ అన్నారు. ఆర్జీ–2 ఏరియా సిమ్‌టార్స్‌లో సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్‌పై రెండురోజుల శిక్షణను ఏరియా జీఎం వెంకటయ్యతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. రీజియన్‌లోని ఓసీపీలు, డిపార్ట్‌మెంటల్ స్టోర్స్, ఏరియా వర్క్‌షాప్, సీఎస్పీల్లో పనిచేస్తున్న ఈపీ ఆపరేటర్లు, ఎంవీ డ్రైవర్లకు సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్‌పై శిక్షణ కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. భద్రత ప్రమాణాలు పాటించాలన్నారు. ఆక్టింగ్ ఎస్‌వోటూ జీఎం ఎస్.సంతోష్‌కుమార్, పర్సనల్ డీజీఎం అరవింద్‌రావు, అధికారుల సంఘం ప్రతినిధి సంజీవ్, నిమ్ డీజీఎం హుస్సైనీ పాల్గొన్నారు.

కోల్‌మూమెంట్ ఈడీని కలిసిన ఆర్జీ–2 జీఎం

గోదావరిఖని: కోల్ మూమెంట్ ఈడీ వెంకన్నజాదవ్‌ను ఆర్జీ–2 జీఎం వెంకటయ్య శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గోదావరిఖని సింగరేణి ఇల్లెందు గెస్ట్‌హౌస్‌కు వచ్చిన ఈడీని కలిసి ఏరియాలోని పరిస్థితి వివరించారు. ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్, ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు, ఏఎల్పీ జీఎం నాగేశ్వర్‌రావు, సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహ్మద్ ఉన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్స్ ఎన్నికలు ఏకగ్రీవం

జూలపల్లి: ఫొటో, వీడియోగ్రాఫర్స్ మండల అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం ఏకగ్రీవంగా జరిగాయి. స్థానిక ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఎన్నికల్లో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా రఘువీర్‌సింగ్, మండల అధ్యక్షుడిగా వేల్పుల రామమూర్తి, ఉపాధ్యక్షుడిగా కొండ మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా మల్లెత్తుల సంతోష్, కోశాధికారిగా అందె శ్రీరాజు, భరోసా ఇన్‌చార్జిగా కనపర్తిభాను, కార్యవర్గ సభ్యులుగా కొండప్రసాద్, అక్కెనపెల్లి అనిల్, బైరి సత్యనారాయణ, కేశవేని సంత్, అట్ల సంతోష్ ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు పోగుల విజయ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉదయ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

తాజుద్దీన్‌బాబా మందిరంలో ఉర్సు వేడుకలు

గోదావరిఖనిటౌన్: స్థానిక సప్తగిరికాలనీలోని హజ్రత్ తాజుద్దీన్‌బాబా మందిరంలో శుక్రవారం ఉర్సు వేడుకలు నిర్వహించారు.

నియామకం

జ్యోతినగర్: మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ముచ్చకుర్తి చంద్రమౌళి పటేల్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు పుట్టం పురుషోత్తంరావు పటేల్ నియామక ఉత్తర్వులు అందించారు. శుక్రవారం వేములవాడలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకుని నియామకపు పత్రాన్ని అందించారు.

ఆర్థికసాయం అందజేత

కోల్‌సిటీ: గోదావరిఖనిలో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఇద్దరు క్యాన్సర్ బాధిత పేషెంట్లకు ఓ ఎన్‌ఆర్‌ఐ మహిళ రూ.10వేలు సాయాన్ని నీడ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అందించారు. యూఎస్‌ఏలో ఉంటున్న తాడివాక బిందు సహృదయ ఫౌండేషన్ సంస్థకు ఫౌండర్‌గా వ్యవహరిస్తున్నారు. గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో పనిచేస్తున్న సరస్వతి, అబ్బాస్‌బీ అనే ఇద్దరు తాత్కాలిక ఉద్యోగులు క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. వీరి దీనస్థితిని గోదావరిఖనికి చెందిన నీడ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు పల్లెర్ల రమేశ్ తీసుకెళ్లాడు. స్పందించిన ఎన్‌ఆర్‌ఐ రూ.10వేలు నీడ సంస్థకు ఆన్‌లైన్ ద్వారా పంపించగా, శుక్రవారం జీజీహెచ్ ఆర్‌ఎంఓ డాక్టర్ దండె రాజు బాధిత మహిళలకు రూ.5వేలు చొప్పున అందజేశారు.